క్లుప్తంగా

ముగిసిన పెరటాసి ఉత్సవాలు

పుంగనూరు: పట్టణంలోని కోనేటిపాళెం వద్ద వున్న కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో చేపట్టిన పెరటాసి ఉత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు శనివారం ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

గంగవరం: కార్డియో పల్మనరీ రెసక్సిటేషన్ (సీపీఆర్)పై అవగాహన కలిగి వుండాలని పలమనేరు ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి యుగంధర్ తెలిపారు. మండలంలోని ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం సీపీఆర్ డే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల ప్రాణ రక్షణకు అత్యంత అవసరమైన పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ హార్ట్ ఎటాక్, అపస్మారక స్థితి లేదా శ్వాస ఆగిన సందర్భంలో సీపీఆర్ చేయడంపై డెమో ఇచ్చారు. వైద్యులు యుగేష్, మంజు, కళాశాల కరస్పాండెంట్ ఎంవీఆర్.రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ పాల్గొన్నారు.

ఉరుసు ప్రారంభం



దర్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లిం మత పెద్దలు

పుంగనూరు: పట్టణంలోని నాగపాళెంలో వున్న హజరత్ మహబూబ్ సుభహాని దర్గాలో శనివారం ఉరుసు మహోత్సవాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం జలాల్ పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాత్రి భక్తులకు అన్నదానం చేశారు. ఖవ్వాలి పాటల పోటీలు నిర్వహించారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు 929 మంది హాజరు

పుంగనూరు: పుంగనూరు పట్టణం, మండలంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన చెకుముకి సైన్సు టాలెంట్ టెస్ట్ పరీక్షలకు 929 మంది హాజరైనట్లు ప్రతినిధులు రామలింగప్ప, మురళి, హేమలత తెలిపారు. ఇక్కడ ఉత్తీర్ణులైన వారికి నవంబర్ 1న మండల స్థాయి, నవంబర్ 23న జిల్లా స్థాయి, డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలను ఉపాధ్యాయులు సుశీల, వేణుగోపాల్, రఘు తదితరులు పర్యవేక్షించారు.

చెకుముకి పోటీలకు మంచి స్పందన

పలమనేరు: జేవీవీ ఆధ్వర్యంలో శనివారం పలమనేరు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నిర్వహించిన చెకుముకి టాలెంట్ పోటీలకు మంచి స్పందన లభించింది. 8, 9, 10 తరగతుల పిల్లలు పాల్గొన్నారని జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి యుగంధర్‌బాబు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



విరిగి పడిన విద్యుత్ స్తంభం, బోల్తా పడిన కారు

చౌడేపల్లె: మండలంలోని అట్లవారిపల్లె సమీపంలో చెరువు కట్ట వద్ద శనివారం కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. పోలీసుల కథనం మేరకు.. కోలారుకు చెందిన యువకుడు కారులో బోయకొండ మీదుగా మదనపల్లె వైపు వెళ్తున్నాడు. అట్లవారిపల్లె సమీపంలో కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తాపడింది. విద్యుత్ స్తంభం నేలకొరిగింది. ఆ సమయంలో ఇతర వాహనాల రాకపోవడం, విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిరుపయోగంగా నీటి తొట్టెలు

- ఇష్టం వచ్చిన చోట నిర్మాణాలు
- వాటిలో నీటిని వదలని వైనం
- పట్టించుకోని అధికారులు

పలమనేరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి వ్యవస్థలోనూ అవినీతి పెచ్చుమీరింది. డబ్బు సంపాదనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పశువుల దాహం తీర్చేందుకు ఉద్దేశించిన నీటి తొట్టెలనూ తమకు అనుకూలంగా మార్చుకున్నారు. పశువులకు అనుకూలంగా కాకుండా తమకు ఇష్టం వచ్చిన చోట నిర్మించారు. దీనికితోడు వాటిలో నీటిని వదలకుండా వదిలేయడంతో తొట్టెలు నిరుపయోగంగా మారాయి. పలమనేరు నియోజకవర్గంలో లక్షకు పైగా పాడి పశువులు, రెండు లక్షల వరకు గొర్రెలు, మేకలు, పొట్టేళ్లు ఉన్నాయి. వీటి దాహార్తిని తీర్చేందుకు గ్రామాల్లో ఉపాధి హామీ నిధులు రూ.27 లక్షలతో ఆరు నెలల క్రితం ఆయా పంచాయతీల్లో నీటి తొట్టెలు నిర్మించారు. వీటిని ఆయా పంచాయతీల్లోని కూటమి నేతలే దక్కించుకున్నారు. పశువులు మేతకు వెళ్లే మార్గాల్లో కాకుండా తమకు ఇష్టం వచ్చిన చోట తొట్టెలను నిర్మించి బిల్లులు చేసుకున్నారు. దీనికితోడు వాటిలో నీటిని వదలలేదు. దీంతో తొట్టెలు ఎందుకూ పనికి రాకుండా నిరుపయోగంగా మారాయి. ఈ విషయంపై ఉపాధి ఏపీడీ ధనలక్ష్మిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

నీటి తొట్టెల వివరాలు

నియోజకవర్గంలో మొత్తం మండలాలు	:	5
మొత్తం పంచాయతీలు	:	90
మంజూరైన నీటి తొట్టెలు	:	90
ఒక్కో తొట్టెకు చేసిన ఖర్చు	:	రూ.27 వేలు





పలమనేరు మండలం కూర్మాయి గ్రామంలో నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టెలు

బోధనా పద్ధతులపై శిక్షణ

పుంగనూరు: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధన చేయాలని ఎంఈవో నటరాజరెడ్డి తెలిపారు. పట్టణంలోని బసవరాజ ప్రభుత్వ హైస్కూల్‌లో శనివారం ఉపాధ్యాయులకు నూతన బోధనా పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠ్యాంశాల విషయంలో మెళకువలను పాటించాలని సూచించారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



ర్యాలీ చేస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు

పుంగనూరు: పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశులు తెలిపారు. ఆయన శనివారం విద్యార్థులతో కలిసి స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. తడిచెత్త, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ కార్మికులకు అందజేయాలని సూచించారు. చెత్తను కాల్చడం వల్ల శ్వాసకోశ వ్యాధులు వస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, అధ్యాపకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమష్టిగా పోరాడదాం



దండికుప్పంలో ఎన్నికైన కమిటీ సభ్యులతో వైఎస్సార్ సీపీ మండల నాయకులు

శాంతిపురం: కూటమి ప్రభుత్వం చేస్తున్న వేధింపులు, అక్రమ కేసులపై సమష్టిగా పోరాడదామని వైఎస్సార్ సీపీ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని దండికుప్పం, కొలమడుగు, గుంజార్లపల్లి గ్రామ కమిటీలను శనివారం ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, జిల్లా ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, రెస్కో మాజీ అధ్యక్షుడు చక్రపాణిరెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి వ్యవహరించారు. వారు మాట్లాడుతూ అధికారం లేదని పార్టీ వీడిన నాయకులను భవిష్యత్తులో పార్టీలోకి రానివ్వబోమని చెప్పారు. అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కష్టపడే వారికి తగిన గుర్తింపు ఇస్తారని పేర్కొన్నారు. డబుల్ గేం ఆడే వారిని దూరంగా ఉంచి కష్టకాలంలో పార్టీ కోసం నిలబడే వారికి మాత్రమే పంచాయతీ, మండల, నియోజకవర్గ, జిల్లా కమిటీలలో ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. దండికుప్పం పంచాయతీ పార్టీ అధ్యక్షుడిగా జేఆర్ఆర్ రామచంద్రారెడ్డి, గౌరవాధ్యక్షులుగా కె రామ్మూర్తి, రవీంద్రప్రసాద్, కొలమడుగు అధ్యక్షుడుగా శ్రీరాములుగౌడు, గౌరవాధ్యక్షులుగా మునిరత్నంగౌడు, నారాయణగౌడు, కర్లగట్ట అధ్యక్షుడుగా బి.వెంకటాచలం, గౌరవాధ్యక్షులుగా వెంకటప్ప, సంపంగి, గుంజార్లపల్లి అధ్యక్షుడుగా కోదండరెడ్డి, గౌరవాధ్యక్షులుగా చంద్రశేఖరరెడ్డి, గంగాధరం, కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల బాధ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సురేష్‌బాబు, జనార్దనరెడ్డి, ఆనందరెడ్డి, చలపతి, ప్రసాదరెడ్డి, సురేష్‌రెడ్డి, రామచంద్ర, విజయకుమార్‌రెడ్డి, నగేష్ పాల్గొన్నారు.

రెవెన్యూ కేసుల వాయిదాకు వినతి



ఏవోకు వినతి పత్రం ఇస్తున్న న్యాయవాదులు

పలమనేరు: స్థానిక ఆర్డీవో కోర్టులో ప్రతి శనివారమూ నిర్వహించే రెవెన్యూ కేసులను ఈ వారం వాయిదా వేయాలని న్యాయవాదులు కోరారు. ఈ మేరకు వారు కార్యాలయ ఏవో కుమారస్వామికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్ భాస్కర్, పలువురు న్యాయవాధులు పాల్గొన్నారు.

ఆకతాయిల మాటలు నమ్మి మోసపోవద్దు



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి లిఖిత

పలమనేరు: కొత్తగా పరిచయయయ్యే ఆకతాయిల మాటలు నమ్మి మోసపోరాదని పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి లిఖిత యువతులకు సూచించారు. పట్టణ సమీపంలోని క్యాటిల్‌ఫామ్ జెడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆటోలు, బస్సుల్లో ప్రయాణించే సమయంలో కొత్త వారితో పరిచయాలు చేసుకోరాదని సూచించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లో పరిచయాలు పెను ప్రమాదమని హెచ్చరించారు. మోసపోయి బాధలు పడే బదులు జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డి, హెచ్‌ఎం విజయకుమార్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

పర్యావరణాన్ని కాపాడుకుందాం

పలమనేరు: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పలమనేరు ఏరియా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ యుగంధర్ తెలిపారు. ఆస్పత్రిలో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మొక్కలు నాటారు. ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వాయు కాలుష్యం పెరుగుతోందన్నారు. ఈ క్రమంలో స్వచ్ఛమైన గాలి కావాలంటే ప్రతి ఒక్కరూ ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. పచ్చని చెట్లుంటే మంచి ఆక్సిజన్ లభిస్తుందని, తద్వారా ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సలహా కమిటీ సభ్యులు, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

శాంతిపురం: అబకలదొడ్డి పంచాయతీలోని వెంకటేష్‌పురం గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైంది. ఆమె పలమనేరులోని ఓ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌లో కోర్సు చేస్తూ అక్కడే హాస్టల్‌లో ఉంటోంది. ఈనెల 11న స్వగ్రామానికి వచ్చింది. 17వ తేదీ మధ్యాహ్నం తర్వాత కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లేక పోవడంతో ఆమె తండ్రి పోలీసులను ఆశ్రయించారు. ఎస్‌ఐ నరేష్ కేసు విచారణ చేస్తున్నారు. కొంత సమాచారం సేకరించామని, రెండు రోజుల్లోపు యువతి ఆచూకీ కనుగొంటామని చెప్పారు.

వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



భజన చేస్తున్న భక్తులు

వి.కోట: పట్టణంలో వెలసిన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాగంణంలో భజన కార్యక్రమం చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త సీతారామయ్య మాట్లాడుతూ దాదాపు 10 ఏళ్లుగా ప్రతి శనివారమూ అఖండ హరి నామస్మరణతో భజన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

జిల్లా జట్లకు విద్యార్థుల ఎంపిక



సదుం: జిల్లా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సదుం: స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుబ్రమణ్యం తెలిపారు. చౌడేపల్లె మండలంలో శుక్రవారం నిర్వహించిన కబడ్డీ పోటీల్లో అండర్ 17 బాలుర విభాగంలో సుజిత్, మహేంద్రనాయుడు, ధరణి, బాలికల విభాగంలో జాహ్నవి ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైనట్టు తెలిపారు. అలాగే అండర్ 14 బాలుర విభాగంలో తులసి, బాలికల విభాగంలో యోగశ్రీ, లిఖిత ఎంపికయ్యారని తెలిపారు. వారిని పీడీలు నౌషద్ అలీ, భాస్కర్ అభినందించారు.

వాలీబాల్ జట్టుకు..



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో పీడీ గాయత్రి

చౌడేపల్లె: మండలంలోని మర్రిమాకులపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు డి.ఇందు, జి.అనుశ్రీ అండర్-17 జిల్లా స్థాయి జట్టుకు ఎంపికైనట్టు హెచ్‌ఎం నాదమునినాయుడు తెలిపారు. కురబలకోట మండలం అంగళ్లులో ఈ నెల 17న జరిగిన పోటీల్లో వీరు ప్రతిభ చూపినట్టు పేర్కొన్నారు. వీరు ఈ నెల 27న తూర్పుగోదావరి జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనున్నట్లు పీడీ గాయత్రి తెలిపారు.

కల్లూరు విద్యార్థి ఎంపిక



మహ్మద్‌సాద్

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.మహ్మద్ సాద్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీవాణి, పీడీలు ప్రవీణ, రాజశేఖర్ తెలిపారు. విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులు వంద శాతం హాజరయ్యేలా చూడాలి

కుప్పం రూరల్: విద్యార్థులు పాఠశాలలకు 100 శాతం హాజరయ్యేలా చూడాలని అడవిబూదుగూరు క్లస్టర్ ఇన్‌చార్జి హెచ్‌ఎం మోహన్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. అడవిబూదుగూరు ఉన్నత పాఠశాలలో శనివారం క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల వర్క్‌బుక్కులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. హ్యాండ్ బుక్ సిలబస్ ప్రకారం పూర్తి చేయాలన్నారు. ఎప్పటికప్పుడు అసైన్‌మెంట్లు నిర్వహించి ఫలితాలను తల్లిదండ్రులకు పంపాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు, క్లస్టర్‌లోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూల రైతులకు అందని ఫలితం

శుభ, అశుభ కార్యాల్లో పూలను ఎక్కువగా వాడతారు. దీంతో ఏడాది పొడవునా రైతులు పూల సాగు చేపడతారు. వ్యాపారులు, దళారుల చేతివాటంతో రైతులకు తగిన గిట్టుబాటు ధర లభించడం లేదు. ఈ నెలలో దసరా, దీపావళి పండుగల పుణ్యమా అని ధరలు కొంతమేర పెరిగాయి. రైతుల కష్టాన్ని వ్యాపారులు గద్దల్లా తన్నుకుపోతున్నారు. రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి మార్కెట్‌లో గంటల వ్యవధిలోనే ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు.

- పెరిగిన బంతి, చామంతి ధరలు
- దసరా, దీపావళి పండుగల ప్రభావం
- రైతులనుంచి కొనేది తక్కువ వ్యాపారులు అమ్మేది ఎక్కువ
- గంటల వ్యవధిలో రెట్టింపు అవుతున్న ధరలు





పలమనేరు ప్రాంతంలో సాగవుతున్న బంతి, చామంతి

పలమనేరు: రాష్ట్రంలోనే పూల సాగులో చిత్తూరు జిల్లాలోని పడమటి ప్రాంతాలు ముందంజలో ఉన్నాయి. ఇక్కడి శీతల వాతావరణం పూల సాగుకు అనుకూలంగా ఉండడం, చెన్నై, బెంగళూరు, తిరుపతి నగరాలు దగ్గరగా వుండడంతో ఎక్కువ మంది రైతులు పూల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈ దఫా పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లో సుమారు 500 హెక్టార్లలో బంతి పూల సాగు చేస్తున్నారు. ప్రస్తుతం 300 హెక్టార్లు కోతదశలో ఉన్నాయి. ఈ తోటల్లో ఇంకా రెండు నెలలు పూల ఉత్పత్తి ఉంటుంది. ప్రస్తుతం హైబ్రిడ్ రకాల కారణంగా ఎకారాకు 8 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. కుప్పం ప్రాంతంలోని గ్రీన్ హౌస్‌లలో ఎకరాకు మేలురకం పూలు 10 నుంచి 12 టన్నుల ఉత్పత్తి అవుతున్నాయి. ఇక్కడి పూలు నాణ్యత బాగుండడంతో మంచి గిరాకీ ఉంటుంది. ఈ ప్రాంతంలో వీకోట, కుప్పం, పుంగనూరు, పలమనేరులో పూల మార్కెట్లు వున్నాయి. ఇక్కడి నుంచి విజయవాడ, తెలంగాణ, కర్ణాటక నుంచి వ్యాపారులు వచ్చి పూలను కొంటుంటారు. అన్ని మార్కెట్లకు చెందిన మండీ వ్యాపారులు రింగుగా ఏర్పడి ఏ రోజుకారోజు ధరలను నిర్ణయిస్తుంటారు.

ధరల నిర్ణయంలో గోల్‌మాల్...

ఇక్కడి పూల మార్కెట్లలో వేలం పాటలను ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి 12లోపు ముగిస్తారు. ప్రస్తుతం మార్కెట్‌లో బంతి ధర కిలో రూ.20 వరకు రైతుకు దక్కుతోంది. పూలను రైతు నుంచి కొన్నందుకు మండీ వ్యాపారికి నూటికి రూ.12ల కమీషన్‌గా చెల్లించాలి. ఆపై మండీ వారు బయటి వ్యాపారులు, లోకల్‌గా పూలను విక్రయించేవారికి 12 గంటల తర్వాత మరువేలం వేస్తారు. ఇక్కడికి వచ్చేసరికి కిలో పూల ధర రూ.25 నుంచి రూ.30 వరకు పలుకుతుంది. ఇదే పూలను కొన్న స్థానిక వ్యాపారులు కిలో రూ.35లకు విక్రయిస్తున్నారు. గంటకు ముందు రూ.20 పలికిన పూలు, మరో గంటలో రూ.35లకు విక్రయిస్తున్నారు. చామంతి రైతుల వద్ద కిలో రూ.50లకు కొనుగోలు చేసి రిటైల్‌గా రూ.60లకు పైగా విక్రయిస్తున్నారు. ప్రస్తుతం పండుగల సీజన్ కావడంతో డిమాండ్‌ను బట్టి రిటైల్ వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలను పెంచేస్తున్నారు. తద్వారా మండీ వ్యాపారులు, రిటైల్ వ్యాపారులకు ఆదాయం వస్తోంది. పంట పండించిన రైతుకు మాత్రం నష్టాలు తప్పడం లేదు. ధరలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సిన మార్కెటింగ్ అధికారులు ఇవీమీ తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులైనా స్పందించాల్సిన అవసరం ఉంది.